రహదారి రక్తసిక్తం

- రెండు ఆటోలు ఢీ, ముగ్గురి దుర్మరణం
- మహబూబ్‌నగర్ జిల్లా కొత్తమొల్గర వద్ద ఘటన

6



వంశీ (ఫైల్)



వర్ధింపారెడ్డి (ఫైల్)



పార్వావత్ పత్రీ (ఫైల్)

ఇంటికి నిప్పు పెట్టిన దుండగులు

- తల్లీ కొడుకులకు తప్పిన ప్రాణాపాయం


7

పాతాళ గంగమ్మ పైపైకి

- గతేడాది కంటే భూగర్భ జలాల గణనీయమైన వృద్ధి
- లింగాల మండలం అంబటిపల్లిలో 0.05 మీటర్ల లోతులోనే నీరు
- ఉండవల్లి మండలంలో 19.02 మీటర్ల లోతులో జలం
- అన్ని జిల్లాల్లో సాధారణం కన్నా ఎక్కువగా వర్షపాతం
- బోరు బావుల కింద సాగుకు రబీలో కూడా ఢోకా లేనట్లే..



అలుగు పారుతున్న వనపర్తి జిల్లా బుద్ధారంగండి చెరువు



గద్వాల జిల్లా ఉండవల్లి మండలం చిన్న ఆముదాలపాడులో బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

వరుణుడు కరుణించాడు. కుండపోత వానలు కురిపిస్తున్నాడు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చెరువులు, చెక్‌డ్యాంలు నిండి అలుగులు దుంకుతున్నాయి. వాగులు పొంగి పొర్లుతున్నాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిండు నీటితో కళకళలాడుతున్నాయి. పాతాళ గంగమ్మ పైపైకి వచ్చింది. అన్ని జిల్లాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదవడంతో సాగు విస్తీర్ణమూ పెరిగింది. నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో సాగు అధికంగా పెరగగా, గద్వాల, వనపర్తి జిల్లాల్లోనూ స్వల్ప పెరుగుదల నమోదైంది.

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది భారీగా కురుస్తున్న వర్షాలతో పాతాళ గంగమ్మ పైపైకి వచ్చింది. గతేడాది సగటుతో పోల్చితే ఈ ఏడాది భూగర్భజలాల్లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. అటు ప్రాజెక్టులకు మే నెల నుంచి వరద ప్రారంభం కావడంతో చెరువులు నిండటం, ఇటు వర్షాలు కూడా జూన్ నెల నుంచి సమృద్ధిగానే కురుస్తుండటం ఈ వృద్ధికి కారణమని చెప్పవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాగులు జాలు పారుతున్నాయి. చెరువులు, చెక్‌డ్యాంలు అలుగులు దుంకుతున్నాయి. ఈ నెలాఖరు వరకు కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనాలు ఉన్నాయి.

50 నుంచి 70 శాతం అధికం

ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాధారణం కంటే సుమారు 50 నుంచి 70 శాతం వరకు అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో భూగర్భజలాలు కూడా పెరగడంతో, వానాకాలం పంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ఎగువన కర్ణాటక నుంచి వస్తున్న వరదలతో ముగుస్తుంది. ఇక యాసంగిలో చెరువుల కింద, బోరు బావుల కింద పంటలు సాగుచేసే వారికి కూడా ఢోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వర్షాలు భారీగా కురవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70,640 ఎకరాల్లో సాగు విస్తీర్ణం అధికంగా జరిగింది. నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో సాగు అధికంగా పెరగగా, గద్వాల, వనపర్తి జిల్లాల్లోనూ స్వల్ప పెరుగుదల నమోదైంది. యాసంగిలో కూడా గతేడాది సాగు అంచనాలను దాటే అవకాశం ఉందని చెప్పవచ్చు.

సగటు కంటే ఎక్కువ వర్షపాతం...

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. 2020 తర్వాత ఈ ఏడాది ఆ స్థాయిలో వర్షపాతం నమోదవుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణ వర్షపాతం ఈ రోజు వరకు 456.9 మిల్లీ మీటర్లు

-మిగతా 6వ పేజీలో..

ఏసీబీ దాడులు

- ఆర్ఐ, సర్వేయర్ అరెస్టు

కొత్తకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అవినీతి ఆరోపణలపై ఇద్దరు రెవెన్యూ అధికారుల ను ఏసీబీ అదుపులోకి తీసుకున్న సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్వేన్ గ్రామానికి చెందిన ఓ రైతు తన ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమికి పూర్తిస్థాయి హక్కులు కల్పించి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లును ఆర్డీవో ఆదేశించారు. ఈ మేరకు భూమి వివరాలు, సాగు చేస్తున్న కాలం, సర్వే నంబర్ లొకేషన్‌పై విచారణ చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వాసు, సర్వేయర్ నవీన్‌రెడ్డిలకు తహసీల్దార్ ఆదేశించారు. ఆ విచారణ సందర్భంగా భూమికి సంబంధించి పూర్తి హక్కులు కల్పించాలంటే రూ.40 వేలు ఇవ్వాలని రైతును ఆ ఇద్దరు డిమాండ్ చేశారు. అప్పటికే విసిగిపోయిన బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. రైతు ఆరోపణలు నిజమని తెలువడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. దాడుల్లో సీఐలు లింగస్వామి, జిలానీ, కిషన్ నాయక్ పాల్గొన్నారు.



ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన ఆర్ఐ వాసు, సర్వేయర్ నవీన్‌రెడ్డి

సర్కార్ బడుల్లో.. ప్రీ ప్రైమరీ విద్య

- ఉమ్మడి జిల్లాల్లోని 94 పాఠశాలల్లో అమలుకు చర్యలు
- ఈ విద్యాసంవత్సరం యూకేజీలో ప్రవేశాలు
- తరగతుల నిర్వహణకు బడిలో ప్రత్యేక గది
- కొనసాగుతున్న టీచర్, ఆయాల ఎంపిక ప్రక్రియ
- దసరా సెలవుల తర్వాత విద్యా బోధన ప్రారంభం

పీఎం శ్రీ పథకం కింద జక్లపల్లిలో కొనసాగుతున్న ప్రీప్రైమరీ పాఠశాల



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే తరగతులు ఉంటాయి. 5 సంవత్సరాలు నిండిన పిల్లలనే చేర్చుకుంటారు. కానీ తల్లిదండ్రులు తమ పిల్లలను మూడేళ్లకే బడికి పంపించాలని భావిస్తున్నారు. దీంతో వారు ప్రైవేట్ పాఠశాలలు, లేదా ప్లేస్కూళ్లలో చేర్పిస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తయ్యాక అదే పాఠశాలలో, లేదా మరో ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పిస్తున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఆలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో శిశు విద్యతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీలను ప్రారంభించాలని తెలంగాణ విద్యాకమీషన్ సిఫారసు చేసింది. కానీ ఈ విద్యాసంవత్సరంలో యుకేజీ మాత్రమే ప్రారంభించి, 4 ఏళ్లు నిండిన పిల్లలకు ప్రవేశాలు కల్పించనున్నారు. విద్యాశాఖ అందుకు ఏర్పాట్లు చేస్తోంది. విడతల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రీప్రైమరీ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు విద్యావేత్తలు చెప్తున్నారు.

విద్యాబోధనకు టీచర్ల నియామకం

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి పాలమూరు జిల్లాలో 94 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 26, నాగర్‌కర్నూల్ జిల్లాలో 21

-మిగతా 6వ పేజీలో..

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం (2025-26) సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్టోబరు మొదటి వారంలోగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటినుంచే అన్ని రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఐకేపీ, మెప్మా తరఫున ఏర్పాటు చేయబోయే కేంద్రాలపై నివేదిక ఇవ్వాలన్నారు. సన్నరకం ధాన్యానికి, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకం కలిపి 4 లక్షల 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పౌరసరఫరాల డీఎం జగన్మోహన్, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీఏఓ అంజనేయులు గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, డీసీఓ రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

జూరాల ప్రాజెక్టుపై రాస్తారోకో

అమరచింత, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు వద్ద హై లెవెల్ బ్రిడ్జిని నందిమల్ల నుంచి రేవులపల్లి మీదుగా నిర్మించాలని కోరుతూ గురువారం జూరాల ప్రాజెక్టుపై ఆయా గ్రామాల ప్రజలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇక్కడే హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు త్యాగం చేసిన తమను దృష్టిలో ఉంచుకుని పాత జీవో ప్రకారమే నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు రాజు, రవి, చింతలన్న, మురళీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాజెక్టుపై రాస్తారోకో చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు



గోపాల్‌పేట సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆగ్రహించిన అన్నదాతలు

- యూరియా కోసం రోడ్డెక్కి ఆందోళనలు

7

డిండికి నీటి తరలింపును నిలిపివేయాలి

-ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా డిండికి నీటి తరలింపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న ఏదుల జలాశయం నుంచి డిండి లిఫ్టు ఇరిగేషన్ పథకానికి రోజుకు అర టీఎంసీ చొప్పున 30 నుంచి 40టీఎంసీల నీటిని తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరందించే ప్రణాళిక విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నున్నపుతండా నుంచి కొల్లాపూర్ సమీపంలోని కుడికిళ్ల వరకు 3.5కిలో మీటర్ల కాల్వ

-మిగతా 6వ పేజీలో..

ఎస్పీ పేరు, ఫొటోతో ఫేక్ ఐడీ

-విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ పేరుతో ఫేక్‌ఐడీ క్రియేట్ చేసినట్లు సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు గురువారం పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ఎస్పీ ఫొటోతో పాటు ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేశారని, ప్రజలు ఎవరూ నమ్మవద్దని పోలీసులు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ ఐడీలతో మేసేజ్‌లు పంపిస్తే వాటిని ఓపెన్ చేయవద్దన్నారు.

పరిహారం చెల్లించాలి



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లిఫ్టు-2 ఏదుల రిజర్వాయర్

- రోడ్డున పడ్డ భూ నిర్వాసితులు
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధితులు

కోడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సాగు, తాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం రైతుల నుంచి భూమి సేకరించింది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు లిఫ్టు-2, ఏదుల రిజర్వాయర్‌లో భాగంగా భూములు కోల్పోయిన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని తీగలపల్లి రైతులకు పరిహారం అందించలేదు. పదేళ్ల క్రితం నష్టపరిహారం చెల్లించకుండా భూములు లాక్కున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. తీగలపల్లి గ్రామంలోని రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా.. ఎవరూ స్పందించకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మా బతుకులు ఆగం చేశారు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం మా భూములను గుంజుకొని మా బతుకులు ఆగం చేశా రు. నా ఆరు ఎకరాలు తీసుకున్నారు. ఇంకా ఎకరా ఇరవై ఆరు గుంటలకు నష్టపరిహారం చెల్లించలేదు. మార్కెట్ ధరకు మూడు రెట్లు పెచ్చించి ఇవ్వాల్సిన నిబంధనలు ఉన్నా అమలు చేయడం లేదు.

- వల్లాతి స్వామి

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

తీగలపల్లి రైతుల భూ ముల వివరాలు పంపించా ల్సిందిగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సూచించాం. 2022లో 47 ఎకరాలకు పీఎన్ అయింది. అందులో 5 ఎకరాలకు అవార్డు కూడా వచ్చింది. కానీ చెల్లింపులు చేయలేదు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం అవార్డు అయిన ఏడాదిలోపే పేమెంట్ చేయాలి. అలా జరగని వాటికి మళ్లీ (పీఎన్), (పీడీ) ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవలే వారికి సమాచారం ఇచ్చాం. వచ్చిన తరువాత రైతులకు దశల వారీగా పరిహారం చెల్లిస్తాం.

- యాదగిరి, డిప్యూటీ కలెక్టర్ భూ సేకరణ అధికారి

వినియోగదారులకు మెరుగైన సేవలు

గద్వాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా)లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యురాలు శోభారాణి అన్నారు. గురువారం గద్వాల మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులకు టెలికాం వినియోగాలపై అవగాహన కల్పించారు. 1997లో టెలికాం వినియోగదారులకు హక్కుల కోసం ట్రాయ్‌యాక్ట్ వచ్చిందని తెలిపారు. మొబైల్ వినియోగంలో ప్రపంచంలోనే భారతదేశం రెండో పెద్ద దేశమని తెలిపారు. టెలికాం సంస్థల నుంచి ఉత్తమ సేవలు పొందేల ఈ తరహా సదస్సులను నిర్వహిస్తున్నామని వివరించారు. 2006లో మొబైల్ పోర్టబిలిటీని తీసుకవచ్చి అదే నెంబర్‌పై ఉత్తమమైన టెలికాం సంస్థను ఎంచుకునే అవకాశం కల్పించిందని వివరించారు. అపరిచిత కాల్స్ వస్తే 1909 నెంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.



టెలికాం సేవలపై అవగాహన కల్పిస్తున్న శోభారాణి

కన్నం వేసింది.. పాత పరిచయస్థుడే

- కోయిలకొండ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురి అరెస్టు.. రూ.3.10 లక్షలు రికవరీ
- గిల్టు నగ అమ్మే క్రమంలో పోలీసులకు చిక్కిన నిందితులు

7

అలంపూర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

» కార్యనిర్వహణాధికారి దీప్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి

అలంపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి తెలిపారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ దసరాతో ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు ఒక్కో విశేష అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారన్నారు. ఆలయంలో ఖడ్గ మాలార్చన, సహస్ర మాలార్చన, నిత్య చండీహోమాలు, ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం వేళ కొలువు పూజ ప్రత్యేకంగా జరుగుతుందని, అష్టమి, దశమి, నవమి రోజులు విశేషంగా అలంకరణలు ఉంటాయని వివరించారు. కల్యాణంతోపాటు రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహించబడతాయని తెలిపారు. ప్రారంభం రోజు నుంచే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేయటంతో పాటు తాగునీరు, వాహనాల పార్కింగ్ సౌకర్యం కోసం కోర్టు ప్రాంగణంలో స్థలం ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

ఉత్సవాల ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్ష

అలంపూర్ క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలపై డీఎస్పీ మొగులయ్య ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. దసరా పండుగ రోజు తుంగభద్ర నదిలో నిర్వహించే తెప్పోత్సవం, ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలం ఏర్పాట్లపై ఈవో దీప్తితో చర్చించారు. సమావేశంలో ధర్మకర్తలు అద్దాకుల రాము, నాగ శిరోమణి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న వి.రజని

వనపర్తి విద్యావిభాగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి విద్యార్థులకు తెలియజేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వి.రజని అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల భవనంలో ఉపాధ్యాయులకు ప్రజ్వల సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, మోటార్ వెహికల్ యాక్ట్, పోష్ యాక్ట్ మరియు బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి తెలియజేశారు. అదేవిధంగా ఉచిత న్యాయ సేవలు మరియు ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, ప్రజ్వల కోఆర్డినేటర్ అంబర్ సింగ్, ప్రజ్వల ఇన్‌చార్జి కృష్ణవేణి, రిసోర్స్ పర్సన్, శ్రీలత, ఏఎంఓ మహానంది మరియు పారా లీగల్ వలంటీర్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

» టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న చలో హైదరాబాద్ (ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడి)కు కేజీబీవీ కార్మికులు తరలిరావాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కిరణ్ అధ్యక్షతన గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అతి తక్కువ వేతనాలతో, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా కేజీబీవీ కార్మికులు వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్య అయినా పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతుందని అందుకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాము, ఉపాధ్యక్షులు బి.నర్సిములు, కె.కాశీనాథ్, ఏజీ.బుట్టో, సహాయ కార్యదర్శి ఏ.నర్సిములు, రామాంజనేయులు, సుశాంత్, కోశాధికారి కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం


సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కన్యకా పరమేశ్వరి దేవాలయం ఫౌండర్, ట్రస్టు చైర్మన్ జూలూరు రమేశ్‌బాబు

కల్వకుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని 37 సంవత్సరాలుగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈసారి జరిగే నవరాత్రి ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆహ్వానం గురువారం అందించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వాసవి దేవస్థానం చైర్మన్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాలకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండె రవి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు వాన శేఖర్, ముత్యాలు, పాపిశెట్టి శ్రీనివాస్, ప్రవీణ్, వేణు, వీరేష్, వెంకటేశ్ ఉన్నారు.

కరుణించని 'విశ్వకర్మ'


విశ్వకర్మ పథకం నైపుణ్య శిక్షణకు ఎంపికైన దరఖాస్తుదారులు

» పథకం ప్రారంభమై రెండేళ్లు పూర్తి

» చాలా మంది అర్హులకు అందని రుణాలు

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా ఇప్పటికీ అర్హులకు పూర్తి స్థాయిలో రుణాలు అందలేదు. ఈ పథకాన్ని విశ్వకర్మ జయంతి సందర్భంగా 2023, సెప్టెంబరు 17న ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. చేతి వృత్తుల వారిని ప్రోత్సహించి, వారికి ఉపాధి అవకాశాలను మెరుగు పరిచే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని ద్వారా 2023-24 నుంచి 2027-28 వరకు వరకు రూ. 13 వేల కోట్ల రూపాయలు అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకం కింద వృత్తి కార్మికులకు గుర్తింపు కార్డుతో పాటు లక్ష రూపాయల నగదును రెండు విడతలుగా అందించనున్నది. వడ్రంగులు, వడ్డెరలు, స్వర్ణకారులు, కుమ్మరులు, కుమ్మరులు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, శిల్పులు, మత్స్యకారులు, టైలర్లు, చర్మకారులు తదితర 18 రకాల వృత్తి దారులకు లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ల ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

2,399 మంది దరఖాస్తుదారులు

ఇప్పటివరకు నారాయణపేట జిల్లాలో 2,399 మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వారిలో గ్రామ పంచాయతీల పరిధిలో 1823, మునిసిపాలిటీల పరిధిలో 576 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో బార్బర్ 91, కార్పెంటర్ 63, గోల్డ్‌స్మిత్ 1, తాపీమేస్త్రీ 10, మెటల్‌స్మిత్ 7, శిల్పి 2, రజకులు 28, మొత్తం 202 మందికి ప్రాథమిక శిక్షణ ఇచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. వారిలో 111 మందికి లక్ష రూపాయల చొప్పున రుణాలు మంజూరు చేశారు. మిగతా వారికి ఇప్పటివరకు ఇవ్వలేదు. అయితే దీనికి సంబంధించిన పోర్టల్‌లో అన్ని వృత్తులకు సంబంధించిన ఆప్షన్లు కనిపించడం లేదని విశ్వకర్మలు చెప్తున్నారు. వాటికి సంబంధించిన లక్ష్యం పూర్తయినందున కొన్నింటిని ఫ్రీజ్ చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

అర్హులైన వారందరికీ శిక్షణ



పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకానికి ఎంపికైన వారందరికీ శిక్షణ ఇస్తాం. ఆధార్, బ్యాంకు ఖాతా ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మునిసిపాలిటీల్లో అధికారులు వాటిని పరిశీలిస్తారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హులను ఎంపిక చేసి రాష్ట్ర కమిటీకి పంపిస్తారు. అక్కడ ట్రేడ్‌ల వారీగా శిక్షణ ఇస్తారు.

- టి.రామలింగేశ్వర్ గౌడ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్

శిక్షణ కొనసాగేది ఇలా..

అభ్యర్థులను ఎంపిక చేసిన తరువాత నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో ఎంచుకున్న వృత్తిలో శిక్షణ ఇస్తారు. ఆ సమయంలో రోజుకు రూ. 500 చొప్పున ఉపకార వేతనం ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక రూ.15 వేల విలువైన టూల్‌కిట్ ఇస్తారు. కేటాయించిన బ్యాంకు నుంచి లక్ష రూపాయల వరకు 5 శాతం వడ్డీతో రుణం పొందవచ్చు. ఈ పథకానికి రెండో విడతలోనూ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

సర్కార్ బడుల్లో.. ప్రీ ప్రైమరీ విద్య


విద్యార్థులను తరగతి గదిలో 'యు' ఆకారంలో కుర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

(5వ పేజీ తరువాయి)

జోగుళాంబ గద్వాల జిల్లాలో 19, వనపర్తి జిల్లాలో 16, నారాయణపేట జిల్లాలో 12 పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యాబోధన కోసం ఒక టీచర్, సహకరించేందుకు ఆయాను నియమిస్తారు. టీచర్‌గా పని చేసేందుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలకు అవకాశం ఉంటుంది. అలాగే ఆయాగా పని చేసేందుకు 7వ తరగతి పూర్తి చేసిన మహిళను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వారు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలని నిబంధన విధించారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇంటర్మీడియట్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో మండల విద్యాశాఖ అధికారులు నిమగ్నం అయ్యారు. ఎంపిక చేసిన అనంతరం ఆ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిస్తారు. ఆ తర్వాత కలెక్టర్ అప్రూవల్ తీసుకొని జాబితాను ఫైనల్ చేస్తారు. ప్రతీ నెల టీచర్‌కు రూ.8000, ఆయాకు రూ. 6000 జీతం చెల్లిస్తారు. ప్రీప్రైమరీ తరగతుల కోసం పాఠశాలలో ఒక గదిని ప్రత్యేకంగా కేటాయించి, చిన్నారులను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. ఆట బొమ్మలు, పరికరాలను అందుబాటులో ఉంచుతారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించనున్నది. ఈ నెల 20వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఎంపిక చేసిన 26 పాఠశాలల్లో దసరా సెలవుల తర్వాత తరగతులను ప్రారంభించనున్నారు.

'పీఎంశ్రీ' కింద రెండు పాఠశాలలు

జిల్లాలో ఇప్పటికే పీఎంశ్రీ పథకం కింద రెండు ప్రీప్రైమరీ పాఠశాలలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని రాంచంద్రపూర్, గండీడ్ మండల పరిధిలోని జక్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ రెండు పాఠశాలల్లోనూ మంచి ఫలితాలు వస్తున్నాయని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే టీచర్లు, ఆయాల ఎంపికకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. ఎంఈవోలు వాటిని పరిశీలించి తుది జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిస్తారు. పాఠశాలల్లో చిన్నారులను చేర్చుకోవాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే సూచించాం.

- దుంకుడు శ్రీనివాస్ , ఏఎంవో మహబూబ్‌నగర్

డిండికి నీటి తరలింపును నిలిపివేయాలి

» ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి..)

తప్ప శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీల వరద నీటిని తీసుకునే 4 లిఫ్టులతో కూడిన కన్వేయర్ వ్యవస్థ, నార్లపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండపూర్ వద్ద ఉన్న రిజర్వాయర్లను కలుపుతూ కాల్వలు, సొరంగాలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 7లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 5లక్షలు, నల్గొండ జిల్లాలో 30వేల ఎకరాలకు సాగునీరందించడానికి డీపీఆర్ రూపొందించి ఆమోదించిందన్నారు. నల్గొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలో 3లక్షల 41వేల ఎకరాలకు సాగునీరందించడానికి డిండి లిఫ్టుఇరిగేషన్ ఏదుల జలాశయం నుంచి నీటిని తీసుకుంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు వ్యవస్థ మొత్తం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 36లక్షల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉందని జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఫేజ్-1, ఫేజ్-2, కోయిల్‌సాగర్ వంటి సాగునీటి పథకాల ద్వారా కేవలం 7నుంచి 8లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరందుతుందన్నారు. నల్గొండ జిల్లాలో 24.7లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా నాగార్జున సాగర్ ఎడమ కాల్వ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టులే కాకుండా గోదావరి నది నుంచి వచ్చే కాల్వల ద్వారా దాదాపు 17లక్షల ఎకరాలకు సాగునీరందించే వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తే దేవరకొండ, మునుగోడులతోపాటు నల్గొండలోని ఇతర ప్రాంతాలకు మరో 5 నుంచి 6లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉందని తెలిపారు. అయినా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీటిని తరలించే ప్రతిపాదనను తెరమీదకు తీసుకురావడం వెనక అంతర్యమేమిటో తెలియడం లేదని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని కారణంగా రైతాంగంలో అభద్రతా భావం నెలకొన్నదని ముఖ్యమంత్రి స్పందించి తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ కళా భవనంపై విచారణ

» ఉర్దూఘర్ నిర్మించొద్దని దళిత, బీసీ సంఘాల ప్రతినిధుల డిమాండ్


అంబేడ్కర్ భవన్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మునిసిపల్ కమిషనర్

పాలమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కళాభవనం స్థలంలో ఉర్దూఘర్ నిర్మాణం చేయరాదని దళిత, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో దళిత సంఘాల ప్రతినిధులతో గురువారం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా కేంద్రం, ఇతర చోట్ల వక్ఫ్ భూములు అనేకం ఉన్నాయని, అక్కడ ఉర్దూఘర్ నిర్మిస్తే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్మించొద్దని దళిత, బీసీ, బహుజన సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో చెప్పారు. తాము ముస్లింలకు వ్యతిరేకం కాదన్నారు. కొందరు రాజకీయ నాయకులు కావాలని ముస్లింలు, దళిత, బహుజనుల మధ్యన చిచ్చుపెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. అధికారులను కలిసిన వారిలో డాక్టర్ అంబేడ్కర్ కళాభవన్ పరిరక్షణ సమితి చైర్మన్ పరమేశ్వర్, రాందాసు, కన్వీనర్ రమేష్, వెంకటరాములు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవీంద్రబాబు, బాలయ్య, చంద్రశేఖర్, నాగరాజు, శ్రీనివాస్, నాగయ్య, లక్ష్మీకాంత్, మైత్రి యాదయ్య, శ్రీనివాసులు, యాదగిరి, శాంతయ్య, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, రమేష్, యాంకి రమేష్, నరేందర్, నరసింహ, అశోక్, శ్రీవల్లి, ఆదివిష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి


వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త శశిభూషణ్

చిన్నచింతకుంట ,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనాల ద్వారానే అధిక దిగుబడులు సాధ్యమని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని లాల్‌కోట, పల్లమరి, వర్థీపూర్, నెల్లికొండి, సీతారాంపేట గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. నాణ్యమైన వరి, కంది, పచ్చజొన్న రకాల విత్తనాలు అందించిన నేపథ్యంలో వాటి విత్తనోత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం అందించడమే ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం లక్ష్యం అన్నారు.

పాతాళ గంగమ్మ పైపైకి!

(5వ పేజీ తరువాయి)

కాగా.. ఇప్పటివరకు 737.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 280.3 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా కురిసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో సాధారణ వర్షపాతం 394.0 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటివరకు 513.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 119.4 మిల్లీమీటర్ల వర్షం అధికంగా కురిసింది. నాగర్‌కర్నూలు జిల్లాలో సాధారణ వర్షపాతం 404.5 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటివరకు 711.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 306.7 మిల్లీమీటర్ల వర్షం అధికంగా కురిసింది. నారాయణపేట జిల్లాలో 440.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా.. ఇప్పటివరకు 638.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లాలో సాధారణ వర్షపాతం 442.6 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటివరకు 705.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. సాధారణం కంటే 263.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అన్ని జిల్లాల్లో దాదాపు 50 శాతం నుంచి 70 శాతం వర్షపాతం అధికంగా నమోదైందని చెప్పవచ్చు.

గతేడాది కంటే మెరుగు

భూగర్భజలాల పెరుగుదలలో గతేడాది కంటే అధిక వృద్ధి నమోదైంది. 2023లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఇబ్బందులు తలెత్తగా.. 2024లో మంచి వర్షాలే కురిశాయి. అయితే గత సంవత్సరం కంటే కూడా ఈ ఏడాది అధిక వర్షపాతంతో భూగర్భజలాలు పెరిగాయని చెప్పవచ్చు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది ఆగస్టులో 4.84 మీటర్లలోతులో ఉన్న భూగర్భజలాలు, ఈ ఏడాది 4.23 మీటర్లకు పెరిగాయి. 0.61 మీటర్ల పెరు గుదల నమోదైంది. ఈ జిల్లాలోని వడ్డేపల్లి మండలంలో అత్యంత పైన 0.16 మీటర్ల లోతులోనే నీరు ఉండగా, ఉండవల్లి మండలంలో అత్యంత లోతులో 19.02 మీటర్లలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత లోతులో భూగర్భజలాలు ఈ మండలంలోనే ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది 9.04 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఈ ఏడాది 5.90 మీటర్లకు పెరిగాయి. గత సంవత్సరం కంటే 3.14 మీ టర్ల పెరుగుదల నమోదైంది. ఈ జిల్లాలో కోయి లకొండ మండలం ఆభంగపట్నంలో అత్యంత లోతులో 17.40 మీటర్ల వద్ద భూగర్భజలాలు ఉండగా.. మహ్మదాబాద్ మండలం నంచర్లలో 0.43 మీటర్ల లోతులోనే నీరు ఉంది. నాగర్‌కర్నూలు జిల్లాలో గతేడాది 10 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఈ ఏడాది 5 మీటర్లకు పెరిగాయి.

ఈ జిల్లాలోని లింగాల మండలం అంబటిపల్లిలో అత్యంతపైన 0.05 మీటర్ల లోతులోనే భూగర్భజలాలు ఉన్నాయి. అత్యంత లోతులో 13.43 మీటర్ల లోతులో కల్వకుర్తి మండలం మార్చాలలో నీరు ఉంది. నారాయణపేట జిల్లాలో గతేడాది ఆగస్టులో 7.20 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఈ ఏడాది 3.81 మీటర్లకు పెరిగాయి. గతేడాది కంటే 3.39 మీటర్ల వృద్ధి నమోదైంది. ఈ జిల్లాలోని మాగనూరు మండలం కొల్పూరులో 0.22 మీటర్లలోతులో నీరు ఉండగా.. ధన్వాడలో 13.43 మీటర్ల లోతులో నీరు ఉంది. వనపర్తి జిల్లాలో గత ఏడాది 4.98 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ఈ సంవత్సరం 4 మీటర్లకు పెరిగాయి. గతేడాది కంటే 0.98 మీటర్లలో నీరు ఉంది. రేవల్లిలో 1.5 మీటర్ల లోతులోనే నీరు ఉండగా.. కొత్తకోటలో 13.95 మీటర్ల లోతులో నీరు ఉంది.


నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం బిజ్వారంలో సమృద్ధిగా దుంకుతున్న బోరు

మాజీ మావోయిస్టుకు స్థానిక ధ్రువపత్రం జారీ

గట్టు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మ, అలియాస్ సుజాతక్క, అలియాస్ కల్పన ఇటీవల డీజీపీ ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. ఈమెకు నేటివ్ (స్థానిక ధ్రువపత్రం) సర్టిఫికెట్ కోసం తల్లి వెంకటమ్మ జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు దరఖాస్తు సమర్పించారు. దీనిపై రెవెన్యూ అధికారులు పెంచికలపాడు గ్రామానికి చేరుకుని కుటుంబసభ్యులు, గ్రామస్థులను విచారించారు. పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం పద్మావతి అలియాస్ సుజాత పెంచికలపాడు గ్రామానికి చెందినట్లు స్థానిక ధ్రువపత్రం జారీ చేసినట్లు తహసీల్దార్ గురువారం తెలిపారు. కాగా 45 ఏళ్ల పాటు అజ్ఞాతంలో ఉన్న ఆమె ఈ నెల 13న డీజీపీ ఎదుట లొంగిపోయారు. ఆ తర్వాత స్వగ్రామానికి వస్తుందని అందరూ భావించగా, వారం రోజులు అవుతున్నా రాలేదు. లొంగిపోయిన అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడిందని సోదరుడు హన్మంతురెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రహదారి రక్తసిక్తం

» రెండు ఆటోలు ఢీ, ముగ్గురి దుర్మరణం

» మహబూబ్‌నగర్ జిల్లా కొత్తమొల్గర దగ్గర ఘటన


సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్న మృతదేహాలు

భూత్పూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో నాగకర్నూల్ జాతీయ రహదారిపైన గురువారం ఉదయం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం దొంతికుంట తండాకు చెందిన పాత్లావత్ సక్రి(36), అదే మండలంలోని గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన గుంపల్లి వంశీ(23), మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన సౌదరి నర్సింహారెడ్డి (57) కలిసి ఖిల్లాఘనపూర్ నుంచి ఆటోలో భూత్పూర్‌కు బయలుదేరారు. కొత్తమొల్గర గ్రామ శివారులోని తుల్జాభవానీ తండా దగ్గర భూత్పూర్ నుంచి బిజినేపల్లి వైపునకు కిరాణ సామానులతో వెళుతున్న మరో ఆటో ఎదురుగా వచ్చింది. దీంతో ఆ రెండు ఆటోలు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఘనపూర్ నుంచి భూత్పూర్‌కు వెళుతున్న ఆటోలో నలుగు ప్రయాణికులు ఉన్నారు. వారిలో వంశీ, నర్సింహారెడ్డి సంఘటనా స్థలంలోనే తలలు పగిలి మృతి చెందారు. పాత్లావత్ సక్రి అనే మహిళను చికిత్స కోసం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే మృతురాలు సక్రికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె తన ఇద్దరు కూతుళ్లను జడ్చర్లలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివిస్తోంది. దసరా పండుగ సెలవుల సందర్భంగా పిల్లలిద్దరినీ తీసుకురావడానికి వెళుతూ మృతి చెందింది. అదే విధంగా వంశీ అనే యువకుడు ఖిల్లాఘనపూర్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. భూత్పూర్‌కు వస్తుండగా ఈ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉండే నర్సింహారెడ్డి సొంత పనుల నిమిత్తం ఖిల్లాఘణపూర్‌కు వచ్చి వెళుతుండగా మృతి చెందాడు. అతని భార్య రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఒక కుమారుడు ఉన్నాడు. విషయం తెలుసుకున్న భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ సంఘటనకు సంబంధించిన రెండు ఆటోల డ్రైవర్లు పారిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాగకర్నూల్ జాతీయ రహదారి రక్తంతో తడిసి ముద్దయింది. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా ఆటో నడిపి ప్రమాదానికి కారణం అయిన ఘనపూర్‌కు చెందిన బగ్గని నర్సింహులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వృద్ధురాలి మృతి

గద్వాల క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని కుర్వవీధికి చెందిన కుర్వగోవిందమ్మ(70) బుధవారం రాత్రి గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందినట్లు గురువారం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుర్వ గోవిందమ్మ గత కొన్ని రోజులుగా మతిస్థిమితం బాగాలేక ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చేదన్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 11గంటలకు ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన ఆమె రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


తూంకుంట వాగులో దాడులు నిర్వహిస్తున్న తహసీల్దార్

వీపనగండ్ల/అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీపనగండ్ల మండలం తూంకుంట వాగులో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. గురువారం తూంకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దార్ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. వాగులో ట్రాక్టర్లు వదిలి యజమానులు అక్కడి నుంచి పరారయ్యారు. ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

పుల్లూరు శివారులో రెండు ఇసుక లారీలు..

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో గల పుల్లూరు టోల్‌ప్లాజా మీదుగా తెలంగాణలోకి ప్రవేశిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున కె.రవి, అనిల్ కుమార్ బ్లూకోట్ విధులు చేస్తుండగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను గమనించి ఠాణాకు తరలించారు. లారీ డ్రైవర్లు రాముడు, విశ్వనాథ్, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయాలైన శ్రీనివాస్ రెడ్డిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

బిజినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తుండగా అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామిలు గురువారం లట్టుపల్లిలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. మార్గంమధ్యలో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. శ్రీనివాస్ రెడ్డి తలకు, కంటికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటస్వామికి కాలుకు గాయాలు కావడంతో గ్రామస్థులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వాకింగ్ చేస్తున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్

పెబ్బేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో ఒక వ్యక్తి రోడ్డు పక్కన వాకింగ్ చేస్తుండగా మరో వ్యక్తి బైక్‌తో ఢీకొట్టిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలిలా.. గుమ్మడం గ్రామం నుంచి క్రాస్ రోడ్డు వరకు వీరపోగు కృష్ణయ్య రోజు మాదిరిగానే ఉదయం రోడ్డుపై వాకింగ్ చేస్తున్నాడు. యాపర్ల గ్రామానికి చెందిన మంగలి బాలు అతివేగంతో తన ద్విచక్ర వాహనంతో వీరపోగు కృష్ణయ్యను ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి తమ్ముడు వీరపోగు ధర్మేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలంలో గంజాయి మొక్కలు స్వాధీనం

● నిందితుడి అరెస్టు


గంజాయి మొక్కలు, నిందితుడితో సీఐ టి.శ్రీను

గద్వాల క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తున్న నిందితుడిని అరెస్టుచేయడంతో పాటు అతడి నుంచి 9 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల సీఐ టి. శ్రీను తెలిపారు. గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిజ మండలం తొత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన బస్వాపురం ప్రాణేష్ అనే వ్యక్తి బుధవారం గట్టు మండలం బోయలగూడెం శివారులో పొలం కౌలుకు తీసుకున్నాడు. అందులో మిరప, పత్తి పంటల మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా, అక్రమంగా తన స్వలాభం కోసం గంజాయి సాగు చేస్తున్నాడన్నారు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు గట్టు ఎస్ఐ. కె.టి.మల్లేష్ సిబ్బందితో పాటు అగ్రికల్చర్, రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ సెక్రటరీని కలిసి బోయలగూడెం సర్వే నెం. 382/లలో అక్రమంగా సాగుచేస్తున్న 9 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నేరస్థుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరపర్చగా రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

రేవల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేవల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ సత్యం (60) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టి.సత్యం, నరసమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సత్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్ మ్యాన్‌గా విధులు నిర్వ హిస్తున్నాడు. సత్యం గురువారం ఉదయం ఇంట్లో కుటుంబ సభ్యులకు కని పించలేదు. గ్రామంలో వెతికినా కుటుంబ సభ్యులకు ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులో విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉన్న సత్యాన్ని చూసి గ్రామస్థులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సత్యం మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు రేవల్లి ఆసుపత్రికి తరలించామని, ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ రజిత తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఊట్కూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో శుభకార్యానికంటూ వెళుతూ రోడ్డుప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వివాహం అయిన నాలుగు నెలలకే భార్గవి (21) అనే యువతి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఊట్కూర్ ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. ఊట్కూర్ మండలం మల్లెపల్లి గ్రామానికి చెందిన లింగప్పకు దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన బోయిన హన్మంతు కుమార్తె భార్గవి అలియాస్ పవిత్రతో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. లింగప్ప చిన్నాన్న ఈ నెల 9న గ్రామ దేవత కందుర్లు చేయడంతో భార్యాభర్తలు కలిసి సొంత ఆటోలో వెళ్లారు. అనంతరం గ్రామా నికి తిరిగి వస్తుండగా మల్లెపల్లి, కొల్లూర్ గ్రామాల మధ్యన రోడ్డుపై గుంత లను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉ న్న భార్గవి తలకు బలమైన గాయమైంది. మక్తల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.

బాదేపల్లి మార్కెట్‌లో

సమస్యలు బోలెడు

» సరిపడా షెడ్‌లు లేక రైతుల ఇక్కట్లు

» ప్రారంభమైన ధాన్యం విక్రయాల సీజన్

» ఆరుబయటే ధాన్యం ఆరబోత


బాదేపల్లి మార్కెట్‌లో షెడ్‌లు లేక ఆరుబయటే కుప్పలుగా పోసిన ధాన్యం

జడ్చర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నతో పాటు చిరుధాన్యాల విక్రయాల సీజన్ ప్రారంభమయ్యింది. జడ్చర్ల నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి బాదేపల్లి మార్కెట్‌ను తీసుకొస్తారు. సీజన్ ప్రారంభమైనా రైతులకు కల్పించాల్సిన వసతులు కరువయ్యాయి. షెడ్‌లు లేక ఆరుబయటనే రైతులు తెచ్చిన ధాన్యాన్ని కుప్పలుగా పోసుకుంటున్నారు. నూతనంగా షెడ్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చొరవతో నూతనంగా షెడ్ నిర్మాణానికి రూ.కోటీ 75లక్షలు మంజూరు చేయించారు.

షెడ్‌లు ఏవీ?

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రెండు మాత్రమే పెద్ద షెడ్‌లు ఉన్నాయి. సుమారు 20 సంవత్సరాల క్రితం నిర్మించిన చిన్న, చిన్న షెడ్‌లు మరో నాలుగున్నాయి. అవీ వర్షం వస్తే కురిసే దీనస్థితిలో ఉన్నాయి. దీంతో రైతులు తెచ్చిన ధాన్యం ఆరుబయటనే కుప్పలుగా పోసుకునే పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే కొట్టుకుపోయే దుస్థితి ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొంది. నూతనంగా మార్కెట్‌లో రెండు పెద్ద షెడ్‌లను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం



బాదేపల్లి మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో మార్కెట్‌లో నూతనంగా షెడ్ నిర్మించేందుకు రూ.కోటీ 75 లక్షలు మంజూరయ్యాయి. రైతులకు విశ్రాంతి భవనం అంశంపై ఇప్పటికే పాలకవర్గంతో చర్చించాం. ఎమ్మెల్యే సహకారంతో భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది.

- జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

గత సంవత్సరం రూ.6.97 కోట్ల ఆదాయం

బాదేపల్లి మార్కెట్‌కు గత ఆర్థిక సంవత్సరంలో రూ.6 కోట్ల 97లక్షల 63వేల ఆదాయం సమకూరింది. పది సంవత్సరాల్లో (2014-2025 ఆర్థిక సంవత్సరం) వరకు రూ.40కోట్ల 13లక్షల 85వేల ఆదాయం వచ్చింది. గడిచిన పదేళ్లలో కేవలం కరోనా సీజన్‌తో పాటు అంతకు ముందు ఒక్క సంవత్సరం మాత్రమే మార్కెట్ ఆదాయం తక్కువగా ఉంది. మిగిలిన ఆర్థిక సంవత్సరాల్లో మార్కెట్ ఆదాయం కనీసంగా 2 కోట్లకు పైబడి కలిగి ఉంది.

రైతులకు వసతుల కరువు

బాదేపల్లి మార్కెట్‌కు ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులకు కనీస వసతులు, సౌకర్యాలు కరువయ్యాయి. రైతులు వెంట తెచ్చుకున్న భోజనం చేసేందుకు సైతం సౌకర్యాలు లేవు. గతంలో రైతు విశ్రాంతి భవనం ఉండగా, అదే స్థానంలో నూతనంగా నిర్మించేందుకు కూల్చివేశారు. నూతన భవన నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు సేద తీరేందుకు కనీస వసతి లేకుండా ఉంది. విక్రయించడానికి కుప్పలుగా పోసిన ధాన్యం వద్దనే రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

కన్నం వేసింది.. పాత పరిచయస్థుడే

» కోయిలకొండ చోరీ కేసు ఛేదించిన పోలీసులు

» ఏడుగురి అరెస్ట్.. రూ.3.10 లక్షలు రికవరీ

» గిల్టు నగ అమ్మే క్రమంలో పోలీసులకు చిక్కిన నిందితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అతని వ్యవసాయ పొలంలో గాసం చేసిన వ్యక్తే దొంగగా మారాడు.. స్నేహితులతో కలిసి తాళం వేసిన షెటర్ తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న రూ.4 లక్షలు కాజేశారు.. వారం రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించిన నిందితులను కటకటాలకు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ అజీజ్ చావుష్ బజవి అనే వ్యక్తికి కోయిలకొండలో కాంప్లెక్స్ ఉంది. ఇందులో ఉన్న షెటర్‌లో ఈనెల 11న అర్ధరాత్రి దొంగతనం జరిగింది. బీరువాలో ఉన్న రూ.4 లక్షల నగదు, 1.8 కిలోల గిల్ట్ నగను అపహరించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, కోయిలకొండ మండలం వీరన్నపల్లికి చెందిన వడెన్న ఇదే గ్రామంలో ఫిర్యాదుదారుడికి చెందిన వ్యవసాయ పొలంలో గాసం చేసేవాడు. కొన్నాళ్ల క్రితం పనిమానేసాడు. తరువాత రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలని తిరిగే క్రమంలో ఇతనికి బాలానగర్ మండలం ఎక్వాయ్‌పల్లికి చెందిన ముష్టి శ్రీనివాసులు, ఏదుల మండలం వాల్యానాయక్ తండాకు చెందిన ఆటోడ్రైవర్ ముడావత్ సురేశ్, అదే తండాకు చెందిన ఆటో డ్రైవర్ సురేశ్, జడ్చర్ల బాదేపల్లికి చెందిన మనిమరి శేఖర్, గద్వాలకు చెందిన ఉప్పల ఉదయ్‌కుమార్‌లు పరిచయమై స్నేహితులుగా మారారు. వీళ్లకు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో జడ్చర్లలో అందరూ సమావేశమై దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏ1 వడెన్న తను ఇదివరకు పనిచేసిన అబ్దుల్ అజీజ్ వద్ద పెద్దమొత్తంలో డబ్బు ఉంటుందని, డబ్బు షెటర్‌లోని బీరువాలో దాస్తాడని అక్కడ దొంగతనం చేద్దామని చెప్పాడు. ఇందుకు అందరూ కలిసి ఈనెల 11న కోయిలకొండ చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో షెటర్ తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న రూ.4 లక్షల నగదు, గిల్ట్ నగ లాంగ్‌చైన్ అపహరించారు. అయితే గిల్ట్ నగను ఒరిజనల్ బంగారునగ అని నమ్మించి విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో ఏ-2గా ఉన్న ముష్టి శ్రీనివాసులు దొంగతనాలలో పాత నేరస్థుడైన తనకు తెలిసిన ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో కార్పెంటర్ అయిన రాజేంద్ర ప్రసాద్‌ను సంప్రదించాడు. అతన్ని ఈనెల 17న జడ్చర్లకు పిలిపించి తమ వద్ద ఉన్న గిల్ట్ నగను చూపించారు. దీన్ని ఒరిజనల్ బంగారుగా విక్రయించాలని అతనికి కొంత డబ్బు ఇచ్చారు. అతను ఇందుకు అంగీకరించాడు. గురువారం ఉదయం కోయిలకొండ మండలం వీరన్నపల్లి వడెన్న నివాసంలో అప్పటికే ఖర్చు చేసిన రూ.90 వేలు పోనూ మిగతా సొమ్ములో ఏ-1 నుంచి ఏ-6 వరకు సమానంగా ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పంచుకున్నారు. మిగిలిన రూ.10 వేలే ఏ7కు ఇచ్చారు. అక్కడినుంచి రెండు కార్లలో బయలుదేరారు. జడ్చర్ల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా రెండుకార్లలో వచ్చిన నిందితులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా దొంగతనం విషయం బయటపడింది. నిందితుల్లో ఏ7గా ఉన్న రాజేంద్రప్రసాద్‌పై అక్కడ 5 దొంగతనం కేసులు ఉన్నాయి. నక్సలైట్ అని చెప్పి బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద రూ.3.10 లక్షల నగదు, 1.8 కిలోల గిల్ట్ నగ, రెండు కార్లను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన కోయిలకొండ ఎస్‌ఐ తిరుపాజి, కానిస్టేబుళ్లు సతీష్, అజార్, శ్రీనివాసులు, ప్రవీణ్‌లను డీఎస్పీ అభినందించారు. రూరల్ సీఐ గాంధీనాయక్, కోయిలకొండ ఎస్‌ఐ తిరుపాజి పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌రెడ్డికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బాధ్యతలు


టీపీసీసీ ఉపాధ్యక్షుడి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో త్వరలో జరగనున్న ఉప ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల మద్దతు కూడగట్టేందుకు ఆ విభాగాల్లో మంచి పట్టున్న టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డికి ఉప ఎన్నికల బాధ్యతలను పార్టీ అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులను గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాంధీభవన్ ఇన్‌చార్జి టి.కుమార్‌రావు హర్షవర్ధన్‌రెడ్డికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఎన్నికలో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేయాలని పార్టీ ఆదేశాలివ్వగా, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ పెరుమల్లు హర్షవర్ధన్‌తో సమావేశమయ్యారు. ఆయన ఆదేశాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఈనెల 22న పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. తనపై నమ్మకంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు అప్పగించడం సంతోషమని ఏఐసీసీ కార్యదర్శి ఆదేశాలతో సభను సక్సెస్ చేయడంతో పాటు ఉప ఎన్నికలో తనకు అప్పగించిన వర్గాల మద్దతు పార్టీకి దక్కేలా కృషి చేస్తానని హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.

విధులకు హాజరైన డిప్యుటేషన్ ఉపాధ్యాయులు


ఆర్డర్ లేకుండానే బొంకూరు పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బుధవారం రోడ్డెక్కిన జోగుళాంబ గద్వాల జిల్లా బొంకూరు పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఉపాధ్యాయులు గురువారం పాఠశాలకు చేరుకున్నారు. కానీ వీరు ఎలాంటి ఆర్డర్ కాపీ లేకుండా వచ్చారని తెలిసింది. దీంతో డిప్యూటేషన్‌పై వచ్చిన వీరు ఎంతవరకు ఉంటారన్నది సందిగ్ధమేనని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లల ఒత్తిడి, పత్రికల్లో వస్తున్న కథనాల మేరకే ఉపాధ్యాయులను పంపారని, పిల్లలకు నాణ్యమైన విద్యనందించడంలో అధికారులకు చిత్తశుద్ధి లేదని విద్యా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

గద్వాల ఎమ్మెల్యేపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు

» ఫిర్యాదు చేసిన గ్రంథాలయ సంస్థ, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు

» ప్రజాపాలన దినోత్సవంలో అవమానించారని ఆవేదన


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు

గద్వాల క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తన పై అసభ్య పదజాలంతో మాట్లాడి అలంపూర్ మనోభావాలను దెబ్బతీశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప గురువారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ ఏవో భూపాల్‌రెడ్డికి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరెడ్డికి తమ ఫిర్యాదులను అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తమ ముఖ్య అనుచరులను మాత్రమే స్టేజ్‌పైకి ఆహ్వానించి కూర్చోబెట్టారని, మిగిలిన అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలిశ్రీనివాసులను కూర్చోబెట్టకపోవడంతో వారు స్టేజీ దగ్గరకు వెళ్లి అడుగుతుండగా గద్వాల ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనతో దొడ్డెప్ప, శ్రీనివాసులను అసభ్యపదజాలంతో దూషించారని తమ కార్యకర్తలతో కలిసి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఆగ్రహించిన అన్నదాతలు

- యూరియా కోసం రోడ్డెక్కి ఆందోళనలు

యూరియా కోసం అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. రోడ్డెక్కి ఆందోళనకు పూనుకున్నారు. పలుచోట్ల అధికారులతో వాగ్వాదానికి దిగారు.

గోపాల్‌పేట/హన్వాడ/అమరచింత/ధరూరు/జడ్చర్ల/మహబూబ్‌నగర్ రూరల్ , సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం మూడు రోజులుగా ఉదయం రాత్రిళ్లు తేడా లేకుండా యూరియా కోసం క్యూలో నిలుచున్న అన్నదాతలు ఒకసారిగా ఆగ్రహించారు. గురువారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట సింగిల్ విండో దగ్గర ఉదయం నుంచే రైతులు అక్కడికి చేరుకొని క్యూలో కవర్లు, చెప్పులతో నిలబడ్డారు. పది గంటలకు అధికారులు వచ్చి యూరియా లేదు.. టోకెన్ ద్వారా యూరియా ఇస్తున్నామని అనడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. వ్యవసాయ సహకార కార్యాలయం ముందు హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. గంటకు పైగా రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కువగా నిలిచిపోయాయి. వ్యవసాయ అధికారి కరుణశ్రీ, తహసీల్దార్ పాండునాయక్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. శుక్రవారం తప్పకుండా యూరియా సరఫరా చేస్తామని కచ్చితమైన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనకు బీఆర్ఎస్ మండల నాయకులు సంఘీభావం తెలిపారు.

క్యూలో కునుకుతీత

● హన్వాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) వద్ద రైతులు యూరియా కోసం రాత్రిపూట నిద్రిస్తున్నారు. గురువారం హన్వాడకు రెండు లారీల యూరియా రాగా వాటిని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో 600 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. అయితే, ఈ నెల 14వ తేదీన ఇచ్చిన టోకెన్లకే యూరియా సరిపోలేదు. సగం మందికే అందించారు. కాగా టోకెన్ల కోసం బుధవారం రాత్రి రైతులు క్యూలోనే ఉండి నిద్రించారు. క్యూలో నిద్రించిన రైతులకు టోకెన్లు ఇచ్చి పంపించారు.

రోడ్డెక్కిన రైతన్నలు

యూరియా కోసం రైతన్నలు మళ్లీ రహదారిపై బైఠాయించిన ఘటన గురువారం వనపర్తి జిల్లా అమరచింతలో చోటు చేసుకుంది. గత వారం ఇచ్చిన టోకెన్లు తీసుకున్న రైతులు అమరచింతలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచి గుమిగూడారు. పెద్ద ఎత్తున వచ్చిన రైతులు మాకు టోకెన్లు ఇవ్వలేదని తక్షణమే ఇవ్వాలని అక్కడున్న పోలీసులు వ్యవసాయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో వచ్చిన టోకెన్లకే ఇస్తున్నామని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు మరికల్-ఆత్మకూరు ప్రధాన రహదారిపై బైఠాయించారు. రాస్తారోకోకు దిగారు. సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ తదితర పార్టీల నాయకులు రైతులతో కలిసి రహదారిపై బైఠాయించారు. రెండు గంటల పాటు బైఠాయించడంతో పోలీసులు జోక్యం చేసుకొని మండల వ్యవసాయ అధికారి అరవిందును పిలిపించారు. రైతులు ఏవోతో కొద్దిసేపు వాగ్వాదం చేశారు. వెంటనే టోకెన్లు జారీ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఆయా పార్టీల నాయకులు కె.రాజన్న, అబ్రహం, సి.రాజు, రవీందర్, శ్యాంసుందర్, మల్లారెడ్డి, రఘుతో పాటు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● రైతులు సమన్వయం పాటించి ఎరువులను తీసుకువెళ్లాలని ధరూర్ ఎస్ఐ కొండా శ్రీహరి సూచించారు. గురువారం ధరూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కేంద్రం వద్ద ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఎస్ఐ పరిశీలించి బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమరచింతలో రాస్తారోకో చేస్తున్న రైతులు

● జడ్చర్ల పట్టణంలోని మార్కెట్ ఆర్చి వద్ద సుమారు అరగంట పాటు రైతులు రోడ్డెక్కారు. ఉదయం నుంచి యూరియా పంపిణీ చేస్తున్న దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నామని, దొరకకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామంటూ వాపోయారు. రైతులు ఆందోళన చేపట్టిన సంఘటన స్థలానికి జడ్చర్ల పోలీసులు చేరుకుని రైతులను సముదాయించారు.

● మహబూబ్‌నగర్ మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు కోడూరు చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ సుధాశ్రీ, కోడూరు తాజా మాజీ సర్పంచ్ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి నిప్పు పెట్టిన దుండగులు

- తల్లీ కొడుకులకు తప్పిన ప్రాణాపాయం


నంది వడ్డెమాన్‌లో బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న పోలీసులు

బిజినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తల్లీ కొడుకులు అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉండగా బయట నుంచి తలుపులకు గొల్లెం పెట్టి, తీగతో బిగించి కట్టి, ఇంటిపై కప్పుకు ఉన్న గూనలో నుంచి సిలిండర్‌పై పెట్రోల్, టర్పెంట్ ఆయిల్ పోసి నిప్పటించిన ఘటన కలకలం రేపింది. బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన బీసం సాయికుమార్, తల్లి మసెమ్మలు బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నా రు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి బయట తలుపులకు గడియ పెట్టడంతో పాటు కరెంటు వైర్‌తో తలుపు తెరవకుండా బిగించి కట్టారు. పైకప్పుకు ఉన్న గూనలో నుంచి పెట్రోల్, టర్పెంటాయిల్‌ను సిలిండర్‌పై పోసి కట్టెకు నిప్పంటించి లోపలికి వేశారు. ఒకసారిగా పెద్ద మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాప్తించింది. దీంతో నిద్రలోంచి లేచిన తల్లీకొడుకులు గట్టిగా కేకలు వేశారు.

చుట్టుపక్కల ఉన్న వారు లేచి గడియ, కరెంట్ వైర్ తీసి వారిని బయటకు తీసుకువచ్చారు. వెంటనే సిలిండర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. విషయం తెలిసిన బీజేపీ నాయకులు దిలీపాచారి, నాగేంద్రం గౌడ్, భూషయ్యలు బాధితులను పరామర్శించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతటి అనైతిక మైన చర్య కు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఐదు గేట్లు ఎత్తి 1.67 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

గద్వాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు భీమానది ఉప్పొంగి జూరాల వద్ద కృష్ణానదిలో కలుస్తోంది. గురువారం శ్రీశైలంకు 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఐదు గేట్లను తెరిచి 1,67,346 క్యూసెక్కులను కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,083 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 212.91 టీఎంసీలు నిల్వ ఉన్నది. అల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 27 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గేట్ల ద్వారా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 22 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 2.80 లక్షల క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు ఉన్నది. ప్రస్తుతం జూరాలకు 1.72 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 26 గేట్లను ఎత్తి 1.80 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 32,293 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 17 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 13 వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

గాయపడిన నెమలి లభ్యం

» పోలీసులకు అప్పజెప్పిన రైతు

అలంపూరు చౌర స్తా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఉండవల్లి మండల శివారులో గురువారం గాయాలతో ఓ నెమలి లభించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు కుమ్మరి మద్దిలేటి తన వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం పొలానికి వెళ్లాడు. పక్కనే ఉన్న మొక్కజొన్న పొలంలో గాయాలతో ఉన్న నెమలిని గమనించి దానిని జాగ్రత్తగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. నెమలికి అవసరమైన చికిత్స నిమిత్తం పశు వైద్యశాలకు పంపారు.

ఇంటర్వ్యూ..

స్వశక్తి సంఘాలకు రూ.56.56 లక్షల వడ్డీ రాయితీ

- సైదులు, ఏపీఎం, వంగూరు



వంగూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో అర్హత గల పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ద్వారా రుణ సౌకర్యం అందించి వారి ఆర్థిక అభివృద్ధికి పాటు పడుతుందని ఏపీఎం సైదులు అన్నారు. డీఆర్‌డీఏ సంస్థ అమలు చేస్తున్న పథకాలపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో విషయాలను తెలియజేశారు

మండలంలో ఎన్ని స్వశక్తి సంఘాలు ఉన్నాయి, ఎంత మంది సభ్యులు ?

మండలంలో 36 గ్రామ సంఘాలు, చిన్న సంఘాలు 738, సభ్యులు 8120మంది ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తి ద్వారా ఎన్ని లక్షల వరకు రుణాలు ఇస్తారు ?

ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. ఈ పథకం కింద రూ.లక్ష నుంచి 3లక్షలవరకు రుణాలు ఇస్తోంది. ఈపథకం ద్వారా రూ. 36లక్షలతో మండల మహిళా సమాఖ్యకు ఆర్టీసీ బస్సును కేటాయించగా, నెలకు రూ.69,468 ఆదాయం వస్తున్నది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శ్రీనిధి ద్వారారుణాలు ఇస్తున్నారా ?

స్వయం సహాయక సంఘంలో ఉన్న సభ్యురాలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే శ్రీనిధి ద్వారా రూ. లక్ష రుణం ఇస్తున్నాం.

స్వశక్తి సంఘాలకు వడ్డీ రాయితీ ఎంత వచ్చింది ?

స్వశక్తి సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబరు 2024 వరకు ప్రభుత్వం మండలంలోని 502 సంఘాలకు రూ. 56,56,298 వడ్డీ రాయితీ చెల్లించింది.

న్యూస్ బాక్స్

టీజీసీపీఎస్ ఈయూ రాష్ట్ర కోశాధికారిగా బాలస్వామి



లింగాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీజీసీపీఎస్‌ఈయూ) రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి డిమాండ్ చేశారు. లింగాల గిరిజన బాలుర వసతిగృహం వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన గురువారం తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్‌ల ద్వారా రాష్ట్ర కోశాధికారిగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు. బాలస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్, సాయి, జాఫర్, నరేందర్ ఉన్నారు.

నేడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ

కందనూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు అగ్ర నాయకుడు, అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ పక్కన ఉన్న సాయిగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కే.కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నరసింహ, ఈ.చంద్రమౌళి కొమ్ము భరత్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, మర్యాద వెంకటయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ హాజరవుతారని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దాపూర్ గ్రామానికి చెందిన సూసుగండ్ల వితేందర్‌రెడ్డికి చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.26,500 చెక్కును గురువారం కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, నెంటశ్రీను, సుదాకర్‌రెడ్డి, వెంకటయ్య, రాములు ఉన్నారు.

నేడు మన్ననూరులో వైద్య శిబిరం

మన్ననూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు పీహెచ్‌సీలో స్వస్త్‌నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మన్ననూరు వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రిడ్జి లేక ప్రజల అవస్థ

అచ్చంపేటరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్నెవారిపల్లి దుందుభీ వాగు ప్రవహించడం వల్ల విద్యార్థుల చదువుకు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. పది రోజులుగా వాగు పొంగిప్రవహించడంతో ప్రజలు తమ అవసరాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. దుందుభీ వాగుపై త్వరగా వంతెన నిర్మించి శాశ్వతంగా పరిష్కరించాలని ఏజెన్సీ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుకు

నిధులు మంజూరు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ

- ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరగకుండా చూడాలని విన్నపం

కల్వకుర్తి/ అచ్చంపేట/ వంగూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి, అచ్చంపేట నియోజక నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బి రోడ్ల వైడెనింగ్‌లకు నిధులు మంజూరు చేయాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. ఆర్‌ఆర్‌ఆర్ రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరగకుండా చూడాలని సీఎంకు వారు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి- అచ్చంపేట నియోజకవర్గాలను కలిపే ఆర్‌అండ్ రోడ్ల వైడెనింగ్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల వివిధ గ్రామాల్లో రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయంజరిగేలా చూడాలని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు బాధితులు నిరసన తెలిపిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూబాధితులకు మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం అందేలా చూడాలని రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కశిరెడ్డి తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలో పెండింగ్ పనులకు నిధుల విడుదలతో పాటు నియోజకవర్గానికి వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని, ఉల్పర నుంచి కల్వకుర్తి వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సీఎంనుకోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవణ నిర్మాణానికి నిధులు విడదల చేయాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఆయాశాఖల అధికారులకు వెంటనే ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

యువత భవిష్యత్తుకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



డ్రగ్స్ రహిత అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వాడకం చదువుపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు శారీరక మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని, వ్యసనానికి లోనైన వారు నేరాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని వారు హెచ్చరించారు. డ్రగ్స్ గురించి ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే 100లేదా 112కు సమాచారమివ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం డ్రగ్స్ రహిత అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన డ్రగ్స్ రహితంపై చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సీనియర్ లెక్చరర్లు అకాడమిక్ మానిటరింగ్ కో ఆర్డినేటర్ అంజయ్య, కళాశాల యాంటీ డ్రగ్ కోఆర్డినేటర్ వనతి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ గోవర్ధన్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతాం

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి

అచ్చంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి, గువ్వల బాలరాజు సారథ్యంలో అచ్చంపేట నియోజకవర్గంలో కషాయ జెండా రెపరెపలాడుతుందని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి, నాయకులు రేణయ్య, రంగినేని రవీందర్ అన్నారు. గువ్వల బాలరాజుకు స్వాగతం పలికేందుకు ప్రజలు కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావడాన్ని చూస్తుంటే రాబోయే రోజుల్లో అచ్చంపేట గడ్డ బీజేపీ అడ్డాగా మారబోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

కల్వకుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఆర్డీవో జనార్దన్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్, ఊర్కొండ మండల అధ్యక్షుడు పరశురాములు, చారకొండ మండల అధ్యక్షులు గెలువయ్య, వివిధ సంఘాల నాయకులు బి.అంజనేయులు, బి.బాలస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : డీహెచ్‌పీఎస్

తాడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పాలకవర్గాలు నీరుగారుస్తున్నాయని, దాన్ని పటిష్టంగా అమలుపర్చి దళితులకు రక్షణ కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. గురువారం తాడూరులో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ముందు దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని, కొత్త పింఛన్లు ఇవ్వాలని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోళ్ల శివ, గూట విజయ్, లలిత, సంఘాల నాయకులు కొత్తపల్లి శివప్రసాద్, బాలవెంకటయ్య, డీహెచ్‌పీఎస్ నాయకులు రాముడు, కృష్ణయ్య, లక్ష్మయ్య, అర్జున్, భీమయ్య, నరసింహ, వెంకటయ్య, గురువయ్య, రాములు, బంగారయ్య, రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ అవార్డు అందుకున్న హిందీ పండిట్ షాకీర్ పాషాను గురువారం పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాముడు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హెచ్‌ఎం.రాము, ఉపాధ్యాయులు ఉమాదేవి, మొగులయ్య, గంగాధర్, గ్రామస్థులు తిరుపత య్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

తిమ్మాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాన్ని నిబంధనలు పాటిస్తూ లబ్ధిదారులు సకాలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి సూచించారు. మండల పరిధిలోని హేమ్లానాయక్ తండాలో పోలింగ్ బూత్‌ను నిర్మాణంలో ఉన్న నూతన అంగన్‌వాడీ భవనాన్ని లబ్ధిదారులునిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె గురువారం పరిశీలించి సూచనలు చేశారు.

అనర్హుల ఓట్ల తొలగింపు


చారకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటరు జాబితా నుంచి అనర్హులైన వారి పేర్లను తొలగించడం జరుగుతుందని తహసీల్దార్ అద్దంకి సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్యాలయ సిబ్బంది ఓటరు జాబితాను పరిశీలించారు. బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తనిఖీ నిర్వహించిన తరువాత పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఎంఆర్ఐ భరత్‌కుమార్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, జూనియర్ అసిస్టెంట్ తరుణ్, జీపీవో రాజు, అంజనేయులు, వందనమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డుల పంపిణీ

కల్వకుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మిత్ర-85 సభ్యులు అవార్డును ప్రదానం చేశారు. స్థానిక జీజేసీలో గురువారం ప్రిన్సిపాల్ బి.రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 1985లో ఇంటర్ పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు(మిత్ర85 సభ్యులు) ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన 14మంది విద్యార్థులకు రూ.50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ వేణు, పాఠశాల హెచ్‌ఎం. ప్రసూన, గర్ల్స్ హై స్కూల్ నాగార్జున, మిత్ర 85 ప్రెసిడెంట్ మోయిన్‌ఖాన్, ఫైనాన్స్ సెక్రటరీ శోభ, బాలీశ్వర్, మనోహర్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో విద్యార్థులకు సులభ బోధన

- విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళా



మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

కందనూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీఎల్‌ఎం మేళాతో విద్యార్థులకు సులభతరంగా బోధన చేయడానికి అవకాశం ఉంటుందని అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా తరగతి గదిలో టీఎల్‌ఎం ఒక దిక్సూచిగా పని చేసి కొత్తఆవిష్కరణకు నాంది పడుతుందని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ తరగతి గదిలో విద్యాబోధనకు టీఎల్‌ఎం కొత్త అవిష్కరణకు దిక్సూచిగా పని చేస్తుందని అన్నారు. తరగతి గదిలో టీఎల్‌ఎం అత్యంత అవసరమన్నారు. రెడిమేడ్‌గా కాకుండా ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసిన టీఎల్‌ఎంను ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శనలను రూపొందించిన ఉపాధ్యాయులకు మెమెంటోను అందజేశారు. అంతకు ముందు సెక్టోరియల్ అధికారులు కిరణ్‌కుమార్, శోభారాణి, మండల విద్యాధికారులు మేళాను ప్రారంభించారు. జిల్లా స్థాయిలో టీఎల్‌ఎం మేళా 200 ప్రదర్శనలను ప్రదర్శించారు. నాలుగు విభాగాల నుంచి 8 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు కిరణ్‌కుమార్, నూరుద్దీన్, శోభారాణి, మురళీధర్‌రెడ్డి, జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు కవి గుడిపల్లి నిరంజన్, వెంకటేశ్వర్లు శెట్టి, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : మాజీ ఎమ్మెల్యే

వంగూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ తెచ్చిన పార్టీ అని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోనేటిపూర్ గ్రామానికి చెందిన పార్టీ నాయకులు కోట్ల నరేందర్‌రావు, కోట్ల ప్రశాంత్‌రావు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్రి జనార్దన్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో హరీష్‌రావు, లక్ష్మణ్, శ్రీను, అంజనేయులు ఉన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

కోడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శి రవితేజకు వినతిపత్రం అందించారు. రెండేళ్ల నుంచి సబ్బులు, నూనెలు, డ్రస్సులు, శానిటైజ్ ఇవ్వడం లేదని, వెంటనే ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా మాదిరిగా వేతనాలు నెల 1వ తేదిన వారి అకౌంట్‌లో జమ చేయాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు సాయిబాబు, రాజమౌళి, కృష్ణయ్య, మహేష్, లక్ష్మయ్య, బాలకృష్ణయ్య, వెంకటయ్య, లక్ష్మణ్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

21 నుంచి కంటివైద్య శిబిరాలు

తెలకపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన చీమర్ల జగదీశ్వర్‌రెడ్డి, హేమలత దంపతుల సహకారంతో శంకర నేత్రాలయ ఎంఈఎస్‌యూ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ కళాశాలలో ఈనెల 21 నుంచి 27 వరకు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చీమర్ల రమేష్‌రెడ్డి, సీఎల్‌ఆర్ కళాశాల కరస్పాండెంట్ రాజ మహేందర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- అదనపు కలెక్టర్ అమరేందర్



వెల్దండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

వెల్దండ, సెప్టంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూ భారతిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకొని, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదపు కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిని పకడ్బందీగా అమలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో 17 వేలకుపైగా భూ సంబంధిత ఫిర్యాదులు రాగా, వాటిలో 3 వేలకు పైగా సాదాబైనామా, 5వేలకు పైగా అసైన్డ్ భూములు, 9 వేల వరకు సాదారణ భూ సమస్యలపై ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. వీఆర్‌వోల స్థానంలో 189 మందిని క్లస్టర్ వారీగా గ్రామపరిపాలనాధికారులను నియమించారని, వారికి తోడుగా లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో భూముల క్రయ, విక్రయాలు సర్వే చిత్రపటం ద్వారా జరుగుతుందని అమరేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

తాడూరు : భూ పట్టాదారులకు సంబంధించి భూ భారతికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అమరేందర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఏ విధంగా పరిష్కరిస్తున్నారు, మండలంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై ఆరా తీశారు. విధుల పట్ల ఎవరూ అలసత్వం వహించిన అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంతి, డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీ, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ పల్లె శ్రీనివాసులు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అచ్చంపేటటౌన్ సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ పల్లె శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు, ఎస్ఐ విజయ్‌భాస్కర్‌లు ఆయనకు మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. సర్కిల్‌లోని నేరాలకు సంబంధించి సూచనలు ఇచ్చారు. రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాత్రివేళలలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై విచారణ చేపట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్

కోడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, వాటిపై ప్రత్యేక విచారణ చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడీవో శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గంలో మిగతా మండలాలతో పాటు కోడేరు మండలంలో కూడా అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పినవారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తప్పెట కిరణ్‌కుమార్, లక్ష్మీపతి, టి.మల్లయ్య, యూసుఫ్, సలేశ్వరం, నరసింహ, కేశవులు, రాముడు, ఊషన్న, జయమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

మూడు నెలలుగా అందని కూలి డబ్బులు

బల్మూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు మూడు నెలలుగా కూలి డబ్బులు రావడం లేదని, వెంటనే చెల్లించాలని ఉపాధి హామీ మేటీల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, కమిటీ సభ్యులు చందునాయక్, కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో చేస్తున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీలో పని చేసే కుటుంబాన్ని పోషించుకునేందుకు చేసిన పనుల డబ్బులు రాకపోవడంతో నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితిలో ఉన్నాయని, ప్రభుత్వం పరిస్థితిని అర్థం చేసుకుని పెండింగ్ డబ్బులను జమ చేయాలని కోరారు. ప్రస్తుత సీజన్‌లో కూలీలు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారని గతంలో ఉన్న బకాయిలను ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కేజీబీవీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కేజీబీవీలో బోరు డ్రిల్లింగ్ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాంగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో కేజీబీవీలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను వారు గురువారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య తీరుతుందని అన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో మంజుల, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, ఎన్ఎస్ యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, పాఠశాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే విద్యార్థుల శారీరక ఎదుగుదల

- డీఈవో రమేష్‌కుమార్

తాడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జీవితంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ఉపయోగకరమని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. గురువారం తాడూరు మండల స్థాయి పాఠశాల క్రీడల సెలక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరయ్యారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు జిల్లా స్థాయిలో పాల్గొనబోయే క్రీడాకారులను ఎంపిక చేశారు. డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పాఠశాల స్థాయి క్రీడలను ప్రోత్సహించడానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం త్యాగరాజు గౌడ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్, అనిల్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : డీఎస్పీ

తిమ్మాజిపేట : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ బుర్ర శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఆవంచ జడ్పీహెచ్ఎస్‌లో గురువారం మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సమావేశంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి, ఆవంచ జీహెచ్‌ఎం అమృత, జాగృతి ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తెలకపల్లి : 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు తెలకపల్లిలో ప్రారంభమయ్యాయి. ఇవి రెండు రోజుల పాటు జరుగుతాయి. అండర్-17, అండర్-14 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. మొదటి రోజు 15 పాఠశాలలకు సంబంధించి 400 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. రెండవ రోజు అండర్-14 విభాగంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. ఎంఈవో సి.శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ గద్దె ప్రశాంతి, గెజిటెడ్ హెచ్‌ఎం శోభన్‌బాబు, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రాజమహేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మాజీ సర్పంచ్ ఎస్.బాలగౌడ్, వారణాసి శ్రీనివాసులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తిమ్మాజిపేట : ఆవంచలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

● బల్మూరు : 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి టోర్నమెంట్ ఎంపికలను గురువారం ఎంపీడీవో శెట్టి రాఘవులు క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో అండర్-14, అండర్-17సంవత్సరాల క్రీడాకారులు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి దాదాపుగా 500మంది బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ ఎంపికలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఎంఈవో విష్ణుమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పాండు, ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, అయా పాఠశాలల ఉపాధ్యాయులు మనీ, పాండు, విజయ, నరేష్, జ్యోతి, కర్ణచౌహాన్, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.